# పేరు మీరే పెట్టండి

అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.

సూపర్‌బజార్‌కెళ్ళి సరుకులు తెచ్చుకుందామని సుజాత బస్టాప్‌లో నిలబడింది. ఎంతకీ బస్ రావటంలేదు. పక్కనే నిలబడి ఉన్న మరో యువతిని పలకరించింది. "ఎందాక వెళ్తున్నారు ?" అంటూ.

"ఆఫీస్‌కే నండి. బస్ మిస్సవుతేనూ, మరో బస్‌కోసం వెయిట్ చేస్తున్నాను" అన్నది ఆ యువతి. అలా అలా కబుర్లు దొర్లాక "ఇంతకీ మీరే ఆఫీస్‌లో పనిచేస్తున్నారు ?" అంది మళ్ళీ సుజాత.

"సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్‌లో నండి."

"ఏమిటి సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డులోనా ?! మీకు రామారావుగారు తెలుసా ?" మళ్ళీ అడిగింది సుజాత.

"భలేవారే! రామారావు తెలియకపోవడమేమిటి!" అంటూ పకపకా నవ్వింది ఆమె.

అంతగా నవ్వాల్సిన అవసరమేమిటో అని ఆలోచిస్తున్న సుజాతను చేత్తో తడుతూ ఆమే అంది.

"ఆ నడక, ఆ ముఖం, ఆ మాటలు ఒక్కసారి విన్నవారు తిరిగి మరచిపోగలరా ? బఫూన్ చేష్టలతో అందరిని ఒకటే నవ్విస్తుంటాడు. పూర్ ఫెలో! ఎదుటివాళ్ళు కాస్త నవ్వంగానే చాలు మరింత విజృంభించి మాట్లాడుతుంటాడు. నిజం చెప్పాలంటే ఒక్కొక్కసారి మరీ జిడ్డులాగ పట్టుకుని ఎంతకీ వదలడండి."

"ఒకసారేమయిందనుకున్నారు! ఇంతోటి గొప్ప అందగాడు మా కొలీగ్‌కి లవ్‌లెటర్ రాశాడండి. అది అందరికి చూపించి ఒకటే నవ్వడం చేసింది. చివరికి ఆఫీసర్‌కిస్తానని బెదిరించేసరికి అందరి ముందు క్షమాపణ చెప్పుకున్నాడు. ఇక అప్పటినుంచి చూడండి అందరూ అతన్ని ఒకటే ఆడిస్తుంటారు."

ఇంతలో బ్ర్‌మని శబ్దంచేస్తూ నాంపల్లి పోయే బస్ వచ్చింది.

"ఇంతకీ రామారావు మీకెలా తెలుసో చెప్పనేలేదు" అంది ఆమె.

"ఆయన మా ఆయన!" కోపంతో ఎర్రబడిన మొఖంతో అంటూ గబుక్కున బస్ ఎక్కింది సుజాత.

**– అరసూర్ శ్యామసుందర్**

(హైదరాబాద్)

*స్రవంతి నెం: 19లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయితలు*
*– కె. రఘుపతి, పి. చిలుకారావు*

పెట్టిన పేరు : కృతజ్ఞత

---

*ఈవారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ : శ్రీ రేవూరు అనంతపద్మనాభరావు*



గత రెండున్నర దశాబ్దాలుగా ఆంధ్రసాహితీ క్షేత్రాన్ని సస్యశ్యామలం చేస్తున్న శ్రీపద్మనాభరావు, ఇరవై పుస్తకాలకు పైగా రచించారు. కవితలు, కథలు, సాహితీ, విమర్శనా, పరిశోధనా వ్యాసాలు.... ఒకటేమిటి అన్ని ప్రక్రియల్లోనూ వీరిది అందెవేసిన చెయ్యి కాబట్టే అన్ని దిన, వార, పక్ష, మాస పత్రికలు వీరి సాహితీ సౌరభాలను అఖిలాంధ్ర కోటికి అందించాయి. వృత్తిరీత్యా ఆకాశవాణిలో అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టరయినా ప్రవృత్తిరీత్యామాత్రం సాహితీ స్రష్ట, ద్రష్ట రెండూను.

"ఒకే వాక్యం ఆధారంగానైనా, కథకులు ఎంచుకున్న మార్గాలు మాత్రం.... ఎంతో విభిన్నంగా ఉన్నాయి. శైలి, భావ వ్యక్తీకరణ ఒక్కో తరహాగా ఉండి విభిన్నరుచుల్ని విరజిమ్మాయి. నాకు నచ్చిన రెండు కథలు–"లోకం తెలియని ఆలోక", "ఆ వ్యక్తి" మీరూ చదివి నా అభిప్రాయంతో ఏకీభవిస్తారని ఆశిస్తున్నాను"

"ఎన్నికైన కథా రచయితలతోపాటు, పాల్గొన్న వారందరికీ నా అభినందనలు."

---

# ఆ వ్యక్తి

హుషారుగా ఈలవేస్తూ డ్రైవ్ చేస్తూ నవ్వుకున్నాడు డాక్టర్ ప్రశాంత్.

ఈరోజు కాస్త ముందుగానే వచ్చెయ్యమంది శ్వేత.

"స్టేట్స్ నుండి కరుణా ఆంటీ, రంగనాథ్ అంకుల్ వచ్చారు. మన శిరీషనుకూడా కాన్వెంట్ నుండి తెచ్చేస్తారని మామగారు వెళ్ళిపోయారు. మీరు త్వరగా వచ్చేస్తే వాళ్ళ అబ్బాయిని పరిచయం చేస్తురుట. మరి మీరు లేట్ చేయకుండా వచ్చేస్తే మీరూ, నేనూ కలిసి వాళ్ళింటికి వెళ్ళాలి. అందరం కలిసి ఫస్టుషోకి పిక్చర్ ప్రోగ్రామ్ ఉంది. మరి వచ్చేస్తారుగా?" అంటూ ప్యూన్ చేత లెటర్ పంపింది శ్వేత.

మరి తను పది నిమిషాలు లేట్ చేసేశాడు. శ్వేత ఏమంటుందో అనుకుంటూ నెమ్మదిగా కారును పార్క్ చేసి కారు హారన్ కొట్టాడు. రోజూ "డాడీ" అంటూ ఎదురొచ్చే శిరీష ఈరోజు ఎందుకు రాలేదు చెప్మా?" అనుకుంటూ తాళం చెవులూపుకుంటూ మెట్లెక్కసాగాడు ప్రశాంత్.

కర్టెన్ తొలగించి లోపలికి అడుగుపెట్టాడు.

"ఏమండీ మన శిరీష...."

"ఊఁ శిరీష.... శిరీష కేమయింది?" కంగారుగా ప్రశ్నించాడు.

"మన శిరీష...."

"చెప్పు శ్వేత! శిరీషకి ఏం జరిగింది?" భుజాలు పట్టుకుని కుదిపాడు.

"ఏం జరగలేదండీ మన శిరీషను అచ్చం మీలాగే ఉన్న వ్యక్తి ఎవరో కాన్వెంట్ మధ్యలో లెసన్ జరుగుతుండగా టీచర్‌నడిగి తీసుకుపోయారటండీ."

"ఏమిటి శ్వేతా నువ్వనేది నాలాంటి వ్యక్తా?"

"అవునండీ."

"అచ్చం నా లాగే ఉన్నాడా? నో.... ఇది అసంభవం."

ఆ హాలు అదిరేలా అరిచాడు ప్రశాంత్ కోపంగా.

అప్పుడే కారు లాక్ చేసి తన గది లోనికి అడుగుపెడుతున్న లాయర్ రాధాకృష్ణగారు "డాడీ, మన శిరీషను మీరు తీసుకురాలేదా?"